# చీకటి బ్రతుకులు.

"1942 సంవత్సరం....

డిశంబరు 11వ తేదీ సాయంకాలం 7 గంటలు....

నాకు బాగా జ్ఞాపకం ఉంది....

చిరు చిరు చలి....

మాకు సెలవు. మహా ఉత్సాహంగా ఉంది."

తన చిత్ర చిత్రమైన అనుభవాలు చిన్న కథలుగా మలచి చెప్పడంలో మా కేశవరావు ఘటకుడు. ఒకనాడు ఇలా అందుకున్నాడు,

'ఈ జరీతలపాగాల్లో, బొద్దు మీసాల్లో, సిల్కు సూట్లల్లో, ఒక్కటిగూడా సెలవురోజుల్లో ఉవ్వెత్తుగా కదిలి ఆడలేదుగదా? మర్యాద, తరహా, ఈ ముకి రోజున ఐనా ఎదురుపడి బెదిరించక పోతే ఎంతబాగుండును!

రప్పున ఎలక్ట్రిక్ లైట్లు వెలిగాయి.

చప్పున నా ఆలోచన ఆరిపోయింది. అబ్బ- కన్నుల్ని పొడిచే ఈ వెలుగువెల్లువ పాపం .... దిక్కులేని చీకటిని నిర్దయగా పొడిచి తరుముతోంది లక్షాధికారి కుంటిబిచ్చగాణ్ణిలాగ.

చీకటిని చూస్తే నాకెందుకో జాలివేస్తుంది. ఏవో ప్రబల కారణాలవల్ల ధైర్యంగా తప్పులుచేసినా-, తోడి మనుష్యులపట్ల

ఉదారంగా ప్రవర్తించే నల్లని ప్రౌఢస్త్రీలా కనపడుతుంది నాకీ చీకటి....

కృతజ్ఞతలేదు.... గాని ....

పాపం చీకటిది ఎంత చల్లని గుండె!

ప్రియురాళ్ళకోసం కుమిలే ప్రియుల్ని, ప్రియులకోసం కృశించే ప్రియురాళ్ళను దగ్గర దగ్గరగా చేర్చి, నిష్కారణంగా కూడులేక మాడే అభాగ్యుడికి ధనవంతుని ఖజానాదోచి ఇచ్చిన అమావాస్య ఔదార్యం జ్ఞప్తి ఉండదు. మనిషికి....

పూర్ణిమ అంటే పడిచచ్చిపోతాడు.

మర్యాదస్తుల సమ్మర్దపు వీధిలో నిలవడానికి దిక్కు మాలిన వ్యభిచారిణిలా వెలుగులో చీకటి తలవంచుకుని తప్పు కుంది పాపం!

పాపపు నల్లని మార్గాని కవతల తెల్లగామెరిసే నక్షత్రం ఒకటి నవ్వుతూ నన్ను పిలుస్తుంది.

ధగధగా వెలిగే పుణ్యపు లోతుల్లో పాయని నల్లనిమచ్చ గదూ.... ఆచంద్రుని కడుపులోని కళంకం!

లంకలో విభీషణుణ్ణీ, అయోధ్యలో కైకమ్మనూ, సృష్టించిన వాల్మీకి మహర్షిగారి కి నా నమస్కారం.

రోడ్డుకు ఎడా పెడా మెరుపు దీపాలలో వెలిగే మేడలు, వెండికోట్లు, సిల్కు షాపులు, చామంతిపూల జడలు, సిల్కు చీరలు, అన్నటివెనకా అగాథమైన గాథలు- నన్నుచెప్పమంటారా?

అబ్బ....ఇప్పుడు నావల్ల కాదు.

మా యింటికి వెళ్లేమలుపు వచ్చింది-మనస్కరించడంలేదు.

'ఇంత కమ్మనైన రాతిరి—

తెలవారి పోవక

ఇదే గతి.....

నాకయి నిల్వరాదాకో'

పూర్వజన్మ వాసనలా ఏ కవిదో ఈపాదం మెదడును తొక్కి నిలిపింది.

ఆగి ఎదురుగా చూశాను.

వాల్ పోష్టరులో "వసంతసేన"—

వనమాల, సాహూమోదక్—

భేష్—

ఆ బురదలోనుంచి ఎంతటి సుగంధిలకమలాన్ని సృష్టించాడు మహాకవి శూద్రకుడు!

నూరు ఘోరాలలో ఒక సుగుణాన్ని చూస్తావా తండ్రీ!

మళుపు తిరిగితే సినీమాహాలు—

చరాచరా నడచి వెళ్ళాను నా మీనమేషాల లెక్కలో మొదటి ఆట దాటి పోయింది

తిరిగి పోవాలని లేదు

అక్కడ తోచడం లేదు.

ఇటుఅటు తిరిగి రెండవఆటకు పోవాలని నిశ్చయించుకొని రోడ్డుమీద పచారీ చేస్తున్నాను. చుంబనాలింగనాలు సమృద్ధిగాఉండే తెలుగుసినిమా కానందువల్ల రెండో ఆటకు అట్టే జనంలేరు. తిరిగితిరిగి ప్రాణంవిసిగి కొంచెం దూరంలోవున్న

మట్టిచెట్టు క్రీనీడలో నుంచున్నాను.

కొన్ని నిమిషాలు గడిచాయి.

౨

సినీమాహాలు కుడిచేతివైపు సందులో మెరుపు దీపాల కాంతి చొరలేదు. అక్కడ చీకటి చిక్కగా పొగమంచులా కమ్ముకుంది.

ఒకవైపు కన్నులు చెదరగొట్టే ఎలక్ట్రిక్ దీపాల కాంతి ప్రవాహం. రెండోవైపు కాటుకముద్దలాంటి చీకటి. పుణ్యపాపష అన్నదమ్ములు ఈ ప్రాంతం పంచుకున్నారు. కాబోలు!

ఏదో చిత్రకథల్ని జ్ఞాపకంచేసే చీకటివైపు ఏం తోచక చూస్తున్నాను.

ఒక ప్రక్క తెల్లని మచ్చ కదుల్తోంది.

అది క్రమంగా కొంగరెక్కలా అడ్డంగా చలించి, నిలువునా ఎదిగి ముందుకు నడవడం మొదలుపెట్టింది. ఆశ్చర్యంగా చూస్తున్నాను.

క్రమంగా అదిఒక తెల్లని చీరగా, నల్లని ఆడపిల్లగా మారి, నాకు అనతి దూరంలో వచ్చినిలుచుని రోడ్డుమీద వెలుగులోకి చూస్తోంది. అట్టే జనం లేరు

ఆరుబయట కాఫీహొటలు ఇనుపకుంపట్లో బీదవాడి ఆకలిలా నిప్పురాజుకుని మండుతోంది. ఇద్దరుముసలాళ్లు చలికి కుంపటి సమీపంలో కూచుని రుచిలేని చచ్చుకబుర్లు చెప్పుకుంటున్నారు. సోడా కుర్రాడు ఆత్రుతగా ఆడవాళ్ళగేటువైపు

చూస్తున్నాడు. ఆమె నాల్గువైపులా చూచింది. ఎవరికోసమో? ఆమెకళ్ళు అలసంగా అశాంతంగా కొట్టుకుంటున్నాయి.

అప్పుడు స్పష్టంగా కనపడుతోంది.

నలిగిపోయిన తెల్లచీర. పొడుగుగా వేలాడే నల్లని జడలో కొంచెం చామంతిపూలు. ఆమె ముఖంలో అందంకంటె మనుషులంటే నిర్లక్ష్యం. కసి, ఎక్కువగా కనబడుతున్నాయి. స్త్రీత్వ మృదుత్వం తప్ప ఆమె ముఖంలో లావణ్యం లేదు. ఇరవై ఏళ్ళ కన్న వయస్సు ఉండదు.

తిన్నగా కాఫీ హోటలు దగ్గరకు వెళ్ళి మాటాడకుండా కొంతసేపు నించుని హోటలుయజమానిని ఏదో మెల్లిగా అడిగింది. వాడు విసుక్కుంటూ కనుబొమ్మలు దగ్గరగా లాగి జవాబు చెప్పాడు.

చలికాగే ముసలాడు నవ్వుతూ పలకరించబోయాడు. కాని విన విసా నడచి తొలిచోటు చాటుకువచ్చి నించుంది.

నాకు ఆమెమీద ఒక కుతూహలం, జాలి, కలిగి సూటిగా ఆమె దగ్గరకు వెళ్ళాను

రెండు నిమిషాలు నా కళ్ళజోడు, సన్న ఖద్దరు బట్టలు, ఆశ్చర్యంగా చూసి తలవంచుకుంది. నే నన్నాను,

"సినీమాకా?"

"....................."

"స్నేహితులు రావాలా? ఎవరైనా''

'ఆ—స్నేహితులే ....ఒస్తారు'

నెమ్మదిగా నవ్వింది. ఆ నవ్వులో నవ్వులేదు 'నాకర్మం నా ఏడుపు నన్నేడవనివ్వండి' అనే నిర్లక్ష్యం మోగుతోంది.

నా సందేహ నివారణ అయింది.

ముందుకు జరిగి చెయ్యి పట్టుకున్నాను.

'నా దోవని నన్ను పోనివ్వండి—

విడవండి నమస్కారం" నెమ్మదిగా చెయ్యి విడిపించు కోవాలని చూసింది.

"మాటాడకు-మీ యిల్లెక్కడ?"

"చాలా దూరం."

"అంటే?"

"ఆ పొలాల వెనుక. తాటిచెట్లలో"

"........"

"రెండు మైళ్ళు"

"ఫర్వాలేదు. పద"

ముందు ఆమె, వెనక నేను. రెండు పొలాలు దాటి గుడిసె చేరుకున్నాం. ఒక ఫర్లాంగుకంటె లేదు.

## 3

పాత కిర్రు తలుపు తోసింది. లోపలికి వెళ్ళాం. ఒక చిన్న సావడి. దానికి ఆనుకుని వెనక ఒక వసారా. దానిలో కొంత తడకలతో మూసిఉంది. అంతే ఇల్లు.

బతకడం ఇష్టంలేని ముసలాడిలా బద్ధకంగా వెలిగే దీపపుకాంతి వసారాలోంచి సావిట్లోకి పడులోంది. నే నక్కడే నించున్నాను. ఆమె ఒక కిరసనాయిలు బుడ్డి వెలిగించి తెచ్చి

నేనున్నచోట కర్ర సెమ్మామీదపెట్టి లోపలికి వెళ్ళింది.

చుట్టూ చూశాను. గోడపక్క కాలువిరిగిన చిన్నపట్టెమంచం మీద ఒక మరకల దుప్పటీ తలగడా ఉన్నాయి.

గోడమీద మాసిపోయిన రెండు రవివర్మ బొమ్మలు, అందులో ఒకటి 'కృష్ణుని రాసక్రీడ' చిరిగి సగం వేలాడుతోంది. తలుపులులేని అలమారులాంటి గూట్లో ఒక కర్రకుంకంబరిణీ, రశాయి పోయినపెద్దఅద్దం, ఇనపపిన్నులు, ఉత్తర దక్షిణాలకు కట్టిన ఒక పొడుగాటి తాటిమీద మురికి గుడ్డలు చిందర వందరగా వేలాడుతున్నాయి.

*　　　*　　　*

"పిల్లా! పిట్ట....ఏదన్నా దొరికిందా?"

"హుష్. మాట్లాడకు ఎవరో గొప్పాయన"

"మనింటికొచ్చే గొప్పాయనెవరే—ఎర్రి మొగం?"

"నీకు తెలియదు. మాట్లాడకు."

"... ... . "

"తినడానికేమేనా ఉందా అమ్మా. డొక్కమాడిపోతావుంది. కాఫీహోటలాడు ఒక అరకప్పు టీ అరువిచ్చాడు కాదు"

"వాడి జిమ్మలాగిరి—ఏం జేతును."

కూడుడకలేదు. ఆచితుగు ఈచితుగు లాగి పొయ్యిలో పెట్టాను. పుల్లలు లేవు బియ్యమూ లేవు. రేపటికి, ఒక అర్థ రూపాయి డబ్బులేనా ఈపొద్దు....'

"ఏమో....నాకాళ్లు తేలిపోతా ఉన్నాయి.

ఒంట్లో కుదురులేదు కన్నుమూసుకు పడుండాలనుంది"

"లే అమ్మ. బద్దకించకు. మూడు నిమిషాలు ఒచ్చినాయన్ని పంపించెయ్యి—రేపటి బతుగు."

"........ .."

పది నిమిషాలు గడిచాయి.

వచ్చింది.

తల నున్నగా దువ్వుకొని బొట్టు ఇంకొకసారి దిద్దుకుని పాత అద్దంలోకి జాలిగా చూచి నిట్టూర్చింది

"అయ్యో! నించునే ఉన్నారా: తెలివితక్కువదాన్ని. ఆ మంచంమీద కూర్చోండి. ఏముంటా యిక్కడ?" సిగ్గుపడుతూ దగ్గరికి వచ్చి నుంచుంది.

మానవత్వాన్ని, అభిమానాన్ని, చంపుకొని కొన్ని డబ్బులకు శరీరాన్ని అమ్మే అలవాటులోపడినా ఆ సిగ్గు ఒక్కటీ చాలదూ ఆమె స్త్రీత్వాన్ని ఆకర్షణీయంగా వెలిగించడానికి

పరమపాతకులను సైతం. హృదయం లోతులకంటా, కౌగలించుకొని. వారి మనసులకు చల్లదనమిచ్చే, గంగాదేవి ఔదార్యం, పతితులను కూడా దగ్గరకు తీసుకుని ఉత్తమజ్ఞాన దానంతో, వారి నాదరించే మహర్షుల విశ్వప్రేమ ఎంత దుర్లభమైనవి!

నీచత్వంలో మురిగిపోయే ఆ పతితురాలిని ఒత్తుగా గుండెమీద చేర్చుకుని కన్నీరు విడిచే ఔన్నత్యం నాకు లేదుగదా....నా సంఘ గౌరవం, చదువు, అంగకారం

నాగొంతుపట్టుకున్నాయి. ఎదురుగా ఉన్న చాపమీద కూర్చో మని సంజ్ఞచేసి అన్నాను.

"అన్నం తిన్నావా?"

"సందేళ తిన్నాను. ఇప్పుడాకల్లేదు. తింటాను." నీరసంగా నవ్వింది.

బలహీనంగా గిలగిలలాడే ఆ కళ్లు అబద్ధం అన్నాయి.

చట్టున సించుని జేబులోంచి ఒక కాగితంతీసి ఆమె ఒడిలోకి శాంతంగా విసరి——

'తలాపు వేసుకుంటావా? వెడుతున్నాను." అన్నాను.

ఆమె ఆశ్చర్యంతో వణకిపోయింది.

"ఏమిటి" అయిదు రూపాయలు!

ఎందుకివి? నావల్ల ఏమి అంది పొందారని?" పాపం. కళ్ళలో నీళ్లు తిరిగాయి తుడుకుని అంది. చిన్నప్పటినుంచి చూస్తున్నాను. ఐదుగురు కలిసికూడా ఇంత ఎప్పుడూ ఇవ్వలేదు. మీ కెందుకూ?"

"చిన్నప్పటినుంచా? పాపం——"

నా ముఖంలోని సానుభూతి ఆమెను బాధపెట్టింది.

"ఔను....మీరు జాలిపడక్కరలేదు. మీరేగా మాకీతోవ నేర్పింది....నాకు మసకమసగ్గా గుర్తుంది.

మా అమ్మ——నా చిన్నతనంలో——పోషించే దిక్కులేక మీవంటి ఒక కామందు ఇంట్లో దాసీపని చేసేది.

ఆ మహారాజు గంపెడు పిల్లల పెళ్లాంతో కాపరం చేస్తూ —— మా అమ్మను మెల్లిగా - చీరలిచ్చి - డబ్బులిచ్చి క్రమంగా

తొంగదీసి, "వద్దు బాబూ" అని అది ఏడ్చినా దిక్కులేంచిగనక దాన్ని గదమాయించి, బుద్ధి విరిచి ఈ నడవడిలోకి దింపాడు. దానితో మా అమ్మ దాసీ పని మానేసి ఈ వృత్తిలో సుఖం కనిపెట్టింది హఠాత్తుగా ఆ ఉంచుగున్నాయన చచ్చిపోయాడు. బతుగు తెరువుకోసం మా అమ్మ ఎందరినో చూడవలసి వచ్చింది. రోజుకు నలుగురైదుగురుతో మా పోషణ జరిగేది. దాని సత్తువ ఉడిగేటప్పటికి నేను పెద్దదాన్నయాను.

నాకు అదే దోవచూపించి మా అమ్మ మెళకువలు నేర్పింది.

కష్టపడి ఏపనీ చెయ్యనక్కర్లేదు. సాయంత్రం ఒక్కగంట కనిపెడితే చాలు. తిండీ గుడ్డా వెళ్ళిపోతాయి.

కూలీనాలీ గౌరవం అనుకుంటారు. గాని వాటిచాటున మాలాటి దిక్కులేనివాళ్ళకి ఈ పని ఎలాగూ తప్పదు. యజమానుల దయకోసం.

ఎక్కడికి వెళ్లినా బీదవాళ్ళను పూర్తిగా పీల్చితేగాని ఏగాని ఇవ్వరు——

ఎందుకు ఆబాధ?

"నాకిది బాగుంది, అలవాటయిపోయింది"

పాపం ఆయాసపడ్డది. నా భాషలో మాటాడడానికి పడ్డ శ్రమ చూస్తే జాలివేసింది.

ఒక్క నిమిషం నిశ్చలంగా గడిచింది.

నేను కదిలి 'చాలా అలసటగా ఉన్నావు, అన్నంతిను, వెడుతున్నాను." అన్నాను.

ఆమె చరాలున లేచి అంది "ఇదిగో మీడబ్బు తీసుకోండి. నేను మిమ్మల్ని బిచ్చం అడగలేదు" తిండిలేక ఎర్రవారిన ఆమె కళ్ళల్లో అభిమానం కణకణ మండింది

అయిదురూపాయలకాగితం తెచ్చి నా పాదాలమీద పెట్టి లేచింది.

ఎంతచచ్చినా హిందూదేశంలో పుట్టింది నా కళ్ళు చెమ్మగిల్లాయి,

చట్టున ఆమెతల నా బుజంమీద పెట్టుకొని "పిచ్చితల్లీ! అభిమానంలో కుంగిపోకు. నిన్ను, నీ వృత్తినీ, నేను ద్వేషిస్తున్నాననుకోకు. ద్వేషించి ఏం లాభం? దుఃఖపడుతున్నాను. ఆకలితో, ఆత్రుతతో, మనుష్యులను వెదికే నిన్ను చూచి జాలితో భరించలేక నేనే కోరి నీ వెంట వచ్చాను.

కనీసం ఒక ఐదురోజులైనా మనుష్యులను బెంగగా వెతుక్కోకుండా ఈ డబ్బుతో విశ్రాంతిగా గడుపు — దూర దేశంలోఉన్నఅన్న ఒకడు తలవనితలంపుగా వచ్చి ఈసహాయం చేశాడనుకో" కాగితం ఆమె చేతిలోపెట్టి చరచరా నడచివచ్చాను. నోట మాటరాక వణకే పెదవులతో దీనంగా చూచే ఆమె ఇప్పటికీ జ్ఞాపకంవస్తుంది నాకు—

అన్నాడు కేశవరావు గంభీరంగా,

---